సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 23 । జనవరి । 2025



దస్తూరీతో దోస్తీ

చదువుతో పాటు దస్తూరీ పైనా దృష్టి సారిస్తే చక్కటి మార్కులు సొంతమంటున్నారు. అక్షర దోషాలు, గజిబిజి రాత వల్ల మార్కులు కోల్పోయే ప్రమాదముందంటున్నారు. 8లో ▸



ఆర్టీసీ కార్గోలో తణుకు ఫస్ట్

కార్గో పార్సిల్స్ అండ్ కొరియర్ డోర్ డెలివరీ మాసోత్సవాల్లో తణుకు ఆర్టీసీ డిపో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 321 శాతం గ్రోత్‌తో మొదటి స్థానం సాధించింది. 8లో ▸



అధికారికి ఆక్వా రైతు బెదిరింపు

ఆక్వా రైతు నుంచి రక్షణ కల్పించాలంటూ డ్రెయినేజీ ఏఈ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఇచ్చేందుకు నాలుగున్నర గంటలు స్టేషన్ వద్ద పడిగాపులు కాశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆడపిల్లలకు రక్షణగా నిలవాలి



భీమవరంలో బేటీ బచావో బేటీ పడావో బైక్ ర్యాలీలో బైక్ నడుపుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ఆడపిల్లలు సురక్షిత వాతావరణంలో పెరిగేందుకు ప్రజలంతా రక్షణగా నిలుస్తూ వారి విద్య, ఇతర రంగాల్లో ప్రాతినిధ్యం వహించేలా తోడ్పాటునివ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. పట్టణంలో బుధవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బేటీ బచావో బేటీ పడావో బైక్ ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముందుగా పాతబస్టాండ్ దగ్గరలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్యే అంజిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీని ఎమ్మెల్యే అంజిబాబు జెండా ఊపి ప్రారంభించగా కలెక్టర్ నాగరాణి స్వయంగా బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు.

పేకాట క్లబ్‌ను మూయించండి



గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురం సెంటర్లో యూత్ కల్చరల్ క్లబ్ పేరిట నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌ను వెంటనే మూసివేయాలని కోరుతూ వివిధ పార్టీలకు చెందిన పలువురు గ్రామ పెద్దలు సర్పంచ్ దొండపాటి వెంకట్, కార్యదర్శి మండెల యుగంధర శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో క్లబ్ కొనసాగితే గ్రామంతో పాటు పరిసర గ్రామాల యువత వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే యూత్ కల్చరల్ క్లబ్ పేరిట ఇచ్చిన అన్ని అనుమతులను రద్దు చేసి పేకాట క్లబ్బును తొలగించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రంపై సంతకాలు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ ఎంటీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న, స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల కోశాధికారి కొండేటి త్రినాథ వెంకటేశ్వర స్వామి, మాజీ సర్పంచ్ అడబాల అయ్యప్ప నాయుడు, కూనపరెడ్డి ఏసు, నల్లి జయవరప్రసాద్ (జెవిఆర్) తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



ఏలూరు సిద్ధార్థలో పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జేఈఈ మెయిన్స్ పరీక్షలు నగరంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్ల మధ్య బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షలకు మొత్తం 551 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ ఒక సెషన్‌లో నిర్వహించగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మరో సెషన్‌లో నిర్వహించారు. తొలి సెషన్‌లో సిద్ధార్థ క్వెస్ట్ పరీక్షా కేంద్రంలో మొత్తం 180 మంది విద్యార్థులకు 175 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 102 మందికి గాను 99 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి గాను 177 మంది హాజరు కాగా, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 104 మందికి గాను 100 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ పరీక్షా కేంద్రం వద్దకు ఆలస్యంగా వచ్చిన ఒక విద్యార్థినిని లోనికి అనుమతించకపోవడంతో సదరు విద్యార్థిని భోరున విలపించింది. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి నిమిషంలో రావడంతో పరుగులు పెట్టి పరీక్షా హాలులోకి వెళ్లాల్సి వచ్చింది.

మద్దతు ధరల చట్టం తేవాలి

ఏలూరు (టూటౌన్): రైతు మెడకు ఉరితాడులా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టాన్ని కేంద్రం తీసుకువస్తోందని రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు పవరుపేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. 26న కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న నిరసనలు,ర్యాలీలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం కార్యదర్శి షేక్ బాషా మాట్లాడారు.

ఆపదలో ఆడబిడ్డ!

- జిల్లాలో ఆందోళనకర స్థాయిలో లింగ నిష్పత్తి వ్యత్యాసం
- 2011 లెక్కల ప్రకారం 1000 మంది పురుషులకు 942 స్త్రీలు
- గత తొమ్మిది నెలల్లో పలుచోట్ల వ్యత్యాసం ఎక్కువగా ఉన్నట్టు గుర్తింపు
- కాళ్ల, పెనుమంత్ర మండలాల్లో 1000 మంది మగవారికి 830 లోపే..
- 51 మంది శిశువులు పురిటిలోనే మరణం
- అప్రమత్తమైన అధికారులు



సాక్షి, భీమవరం: అమ్మగా.. అక్కగా.. చెల్లిగా.. అర్ధాంగిగా.. అనేక పాత్రల్లో చెయ్యి పట్టి నడిపించే ఆడ బిడ్డకు ఆపదొచ్చింది. ఆడపిల్ల భారమనుకునే రోజుల నుంచి ఆడ బిడ్డ కోసం ఎదురుచూసే రోజులు వచ్చినా కొన్ని మండలాల్లో పురుషులు, మహిళల లింగ నిష్పత్తి వ్యత్యాసం ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా యంత్రాంగం అప్రమత్తమై అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఆడ, మగ శిశువు జననాల సంఖ్యను బట్టి వెయ్యి మంది మగవారికి ఎంత మంది మహిళలు ఉన్నారో లింగ నిష్పత్తిని లెక్కగడుతుంటారు. సాధారణంగా పునరుత్పత్తి చేసే జాతుల్లో చాలా వరకు ఆడ మగ మధ్య లింగనిష్పత్తి 1:1 గా ఉంటుంది. 2011 జనాభా మేరకు రాష్ట్ర లింగ నిష్పత్తి 1000 మంది మగవారికి 992 మంది మహిళలు ఉన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా అబార్షన్లు చేయించుకోవడం, భ్రూణ హత్యలు, శిశు మరణాలు, ఆహార పంటల్లో రసాయనాల ప్రభావం, ఒక్కోసారి ఆడ లేదా మగ శిశువులు ఎక్కువగా జన్మించడం, తదితర కారణాలతో లింగ నిష్పత్తిలో వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయని నిపుణులు అంటున్నారు.

ఆ మండలాలపై ప్రత్యేక దృష్టి

లింగ నిష్పత్తి వ్యత్యాసం ఎక్కువగా ఉన్న ఆయా మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతస్థాయి నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలందాయి. ఈ మేరకు లింగ నిష్పత్తిలో పురుషుల కంటే మహిళల సంఖ్య తక్కువగా ఉన్న కాళ్ల, పెనుమంత్ర తదితర మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా చోట్ల ఆడ శిశువుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. లింగస్థ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువులను మొగ్గలోనే తుంచేసేలా అబార్షన్లు చేయించడం, భ్రూణ హత్యలపైనా ఆరా తీస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా నిఘాను మరింత పెంచేలా పోలీసులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఉన్న 155 స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లు మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. స్త్రీల నిష్పత్తిని పెంచే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖతో కలిసి ఆడ బిడ్డల ఆవశ్యకతను వివరిస్తూ భేటి బచావో.. భేటీ పడావో తదితర అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టారు.



మండలం	జననాలు	మగ	ఆడ	1000 మందికి ఆడవారు
ఆచంట	696	352	344	977
ఆకివీడు	661	333	327	982
అత్తిలి	563	288	275	955
భీమవరం	1,878	986	893	906
గణపవరం	591	307	284	925
ఇరగవరం	685	358	327	913
కాళ్ల	655	363	292	804
మొగల్తూరు	531	277	254	917
నర్సాపురం	1,463	765	698	912
పాలకోడేరు	403	214	189	883
పాలకొల్లు	1,017	495	521	1053
పెంటపాడు	640	300	340	1,133
పెనుగొండ	380	199	181	910
పెనుమంత్ర	872	475	397	836
పోడూరు	486	259	227	876
తాడేపల్లిగూడెం	1647	882	765	867
తణుకు	1,348	719	627	872
ఉండి	607	300	307	1,023
వీరవాసరం	657	351	306	872
యలమంచిలి	1,082	564	518	918

900 కంటే తక్కువగా..

2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, ఇంటి వద్ద జరిగిన డెలివరీల ఆధారంగా ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ లింగ నిష్పత్తిని బేరీజు వేసింది. దీనికి సంబంధించిన చైల్డ్ సర్వైవల్ అండ్ సేఫ్ మదర్‌హుడ్ (సీఎస్ఎస్ఎం) గణాంకాల్లో ఆశ్చర్యకర విషయాలు వెలుగుచూశాయి. జిల్లాలో 16,859 మంది జన్మించగా వీరిలో మగ శిశువులు 8,787 మంది, ఆడ శిశువులు 8,072 మంది ఉన్నారు. పాలకొల్లు, పెంటపాడు, ఉండి మండలాల్లో మగ శిశువుల కంటే ఆడ శిశువుల జననాలు ఎక్కువగా ఉంటే ఏడు మండలాల్లో చాలా తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వెయ్యి మంది మగవారిలో ఆడ శిశువులు 800 నుంచి 900 లోపు ఉన్నారు. కాళ్ల మండలంలో 804 మంది, పెనుమంత్రలో 836, తాడేపల్లిగూడెంలో 867, తణుకు, వీరవాసరంలలో 872, పోడూరులో 876, పాలకోడేరులో 883 మంది ఉన్నారు.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



లింగ నిష్పత్తి వ్యత్యాసం ఎక్కువగా ఉన్న మండలాల్లో స్త్రీల నిష్పత్తిని పెంచేందుకు ప్రత్యేక దృష్టిసారించాం. సమాజంలో ఆడ పిల్లల ఆవశ్యకతను వివరిస్తూ స్త్రీశిశు సంక్షేమ శాఖ భాగస్వామ్యంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. – బి.భానునాయక్, జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అక్రమ మట్టి తవ్వకాలు అడ్డగింత



పోలీసులు సీజ్ చేసిన జేసీబీ

సాక్షి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తాల చెరువులో గత కొద్ది రోజులుగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను పోలీసులు బుధవారం అడ్డుకున్నారు. గత కొద్దిరోజులుగా ఈ చెరువులో స్థానిక టీడీపీ నాయకులు కొందరు అక్రమ మట్టి తవ్వకాలను యథేచ్ఛగా జరుపుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెరువులో అడ్డగోలుగా తవ్వకాలు జరిపి భీమడోలు, కై కలూరు తదితర ప్రాంతాలకు మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగానే ఈ అక్రమ దందా సాగుతున్నప్పటికీ ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. దీనిపై ఈ నెల 20న సాక్షి దిన పత్రికలో సత్తాల చెరువులో మట్టి దందా శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పోలీసులు ఈ తవ్వకాలపై దృష్టి సారించారు. తమను ఆపేది ఎవరన్నట్టుగా అక్రమార్కులు రెచ్చిపోయి మరీ ఈ అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతుండటంతో పోలీసుల చేతికి చిక్కారు. చెరువులో తవ్వకాలు జరుపుతుండగా ఒక జేసీబీని, రెండు టిప్పర్లను నిలిపివేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం చర్యలు నిమిత్తం మైనింగ్ శాఖకు సమాచారం అందించారు.



సీజ్ చేసిన టిప్పర్లు

దివ్యాంగులకు తప్పని కష్టాలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పింఛన్ వెరిఫికేషన్ పరీక్షలకు వేచి ఉన్న దివ్యాంగులు

తణుకు అర్బన్: పింఛను వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని శిబిరానికి వచ్చిన దివ్యాంగుల కష్టాలు వరుసగా మూడోరోజు కొనసాగాయి. కంటి, చెవి విభాగాలకు సంబంధించిన దివ్యాంగులకు మూడు రోజులపాటు నిర్వహించిన శిబిరం బుధవారంతో ముగిసింది. వెరిఫికేషన్‌లో భాగంగా కంటి సమస్యలతో పింఛను తీసుకుంటున్న పింఛనుదారులకు కష్టాలు తప్పలేదు. గంటల పాటు వేచిచూడడంతోపాటు మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో దివ్యాంగులు ఎవరికి వారే ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి. వెరిఫికేషన్‌లో భాగంగా కంటి, చెవికి సంబంధించిన దివ్యాంగులను అధిక శాతం విశాఖపట్నంలోని ప్రత్యేక సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాల్సిందిగా శిబిరంలోని వైద్యులు పంపారు. దీంతో మొదటి, రెండోరోజున విశాఖపట్నం వెళ్లిన దివ్యాంగులు అక్కడి వైద్యసిబ్బంది మళ్లీ పదిరోజుల తరువాత రావాల్సిందిగా సమయం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిబిరంలో పూర్తిస్థాయి సాంకేతిక పరికరాలు ఏర్పాటుచేయకపోవడం.. ఏకంగా విశాఖపట్నం పంపిస్తుండడంపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిబిరానికి హాజరైన దివ్యాంగులు, సహాయకులకు సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు అందచేశారు.

21న విశాఖపట్నం వెళ్లాం

మా అత్త కంటి చూపు సమస్యతో గత పదిహేనేళ్లుగా పింఛను తీసుకుంటుంది. ఈ నెల 20న పింఛను వెరిఫికేషన్ కోసం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సెంటర్‌కు తీసుకొచ్చాం. వైద్యులు విశాఖపట్నం వెళ్లి పరీక్ష చేయించుకోవాల్సిందిగా చెప్పారు. అక్కడకు వెళ్తే ఇప్పుడు అవ్వదని తిరిగి పదిరోజుల తరువాత రావాల్సిందిగా చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని ఈ వెరిఫికేషన్ ఏంటో మాకు అర్థం కావడంలేదు. ఎందుకు ఇలా తిప్పుతుందో ఈ ప్రభుత్వం. – శ్రీనివాస్, పింఛనుదారు సహాయకుడు

అనసూయమ్మ కుటుంబానికి రూ.10 లక్షల సాయం

మానవతా దృక్పథంతో స్పందించిన వైఎస్ జగన్



అనసూయమ్మ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో దురదృష్టకర సంఘటనలు జరిగినప్పుడు మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పాలకొల్లు పట్టణం 20వ వార్డుకు చెందిన కలిశెట్టి అనసూయమ్మ ఇంట్లోకి దుండగులు ప్రవేశించి బంగారు వస్తువులు ఎత్తుకుపోవడంతో పాటు అనసూయమ్మపై దాడి చేసి హత్యాప్రయత్నం చేశారు. ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని తన సొంత నిధుల నుంచి ప్రకటించారు. ఈ సహాయాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అనసూయమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆడపిల్లలపై అత్యాచారాలు అధికమయ్యాయని, శాంతి భద్రతలు క్షీణించాయని ప్రసాదరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, యలమంచిలి ఇన్‌చార్జ్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను కోరారు. బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్న సుధీర్ వైఎస్‌ఆర్‌టీఏ ముద్రించిన నూతన సంవత్సర డైరీని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల నెలవారీ పదోన్నతులను పునరుద్ధరించాలని, యాప్‌ల భారం తొలగించేలా ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో అంకితభావంతో పని చేస్తున్నారని డీఈఓను ప్రశంసించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పథకాలను విద్యార్థులకు అందేలా సహకరించాలని, రానున్న 10వ తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో టెక్నీషియన్ల కొరత

- అందుబాటులో నాలుగు ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్ర ఆస్పత్రి
- 20 మంది టెక్నీషియన్లకు కేవలం 9 మంది మాత్రమే
- ఎక్స్‌రే, ఈసీజీ కోసం సామాన్యుడి పడిగాపులు



భీమవరం ఆస్పత్రిలో ఎక్స్‌రే తీస్తున్న డార్క్‌రూమ్ అసిస్టెంట్, ఈసీజీ, ఎక్స్‌రే కోసం వేచి చూస్తున్న జనం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో టెక్నిషియన్ల కొరతతో ఎక్స్‌రే, ఈసీజీల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెంల్లో ఏరియా ప్రభుత్వ ఆస్పత్రులు ఉండగా తణుకులో జిల్లా ఆస్పత్రి ఉంది. ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే, ఈసీజీ సౌకర్యం ఉన్నా.. సక్రమంగా సేవలు అందడం లేదు. గంటల తరబడి ఆస్పత్రుల్లో పడిగాపులు కాస్తున్నారు. అత్యవసరంగా ఈసీజీ అవసరమొస్తే రేడియోగ్రాఫర్ లేక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఏదైన ప్రమాదం జరిగి ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు పేషెంట్లు వస్తే ఎక్స్‌రే తీసేందుకు టెక్నిషియన్ అందుబాటులో ఉండడం లేదు.

కొరత ఉన్నా స్పందించని ప్రజాప్రతినిధులు

జిల్లాలోని నాలుగు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు, జిల్లా ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్లు, డార్క్ రూమ్ అసిస్టెంట్లు మొత్తం 20 మంది ఉండాలి.. కేవలం 9 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. దీంతో పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌రే, ఈసీజీలను రేడియోగ్రాఫర్ లేదా డార్క్ రూమ్ అసిసెంట్ ఎవరు ఉంటే వారు చేస్తున్నారు. ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు ఎక్స్‌రే, ఈసీజీ కోసం రోజుకు 50 నుంచి 200 మంది వరకు వస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలవుతున్న ఇంతవరకూ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని నియమించలేదు. టెక్నిషియన్ కొరత ఉందని వైద్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో లేదో చూడాల్సిన ఎమ్మెల్యేలు మాకెందుకులే అన్నట్లు ఉన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొక తప్పదు.

టెక్నీషియన్ల కొరత ఇలా..

- **తణుకు జిల్లా ఆస్పత్రి:** మొత్తం నలుగురు ఉండాలి. అందులో ఒకరు రేడియోగ్రాఫర్, ముగ్గురు డార్క్ రూమ్ అసిస్టెంట్లు ఉండాలి. ఒక రేడియోగ్రాఫర్, ఒక డార్క్ రూమ్ అసిస్టెంట్ ఉన్నారు.
- **నర్సాపురం ఏరియా ఆస్పత్రి:** నలుగురు ఉండాలి.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. రేడియోగ్రాఫర్ లేరు. డార్క్ రూమ్ అసిస్టెంట్లు ముగ్గురికి గాను ఇద్దరు ఉన్నారు.
- **భీమవరం ఏరియా ఆస్పత్రి:** టెక్నిషియన్లు మొత్తం నలుగురు ఉండాలి.. ఒకరు మాత్రమే ఉన్నారు. రేడియోగ్రాఫర్ మాత్రమే ఉన్నారు. డార్క్ రూమ్ అసిస్టెంట్లు లేరు.
- **పాలకొల్లు ఏరియా ఆస్పత్రి:** టెక్నిషియన్లు నలుగురు ఉండాలి కాని ఇద్దరు మాత్రమే ఉన్నారు. రేడియోగ్రాఫర్ ఒకరుండగా.. డార్క్ రూమ్ అసిస్టెంట్లు ముగ్గురికి గాను ఒకరు ఉన్నారు.
- **తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి:** టెక్నిషియన్లు నలుగురు ఉండాలి. రేడియోగ్రాఫర్ ఒకరు, డార్క్‌రూమ్ అసిస్టెంట్లు ఇద్దరున్నారు. మరో డార్క్‌రూమ్ అసిస్టెంట్ ఉండాలి

మహిళల ఉపాధి కల్పనకు కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఎస్టీ మహిళను ఎస్‌హెచ్‌జీ గ్రూపులో సభ్యులుగా చేర్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళల ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, జీవనోపాధి అవకాశాలు, ఆడపిల్లల చదువులు, డ్రోన్ల వినియోగం, ఎస్‌హెచ్‌జీ రుణాలు, ఆకర్షణీయమైన లేసు అల్లికలు తదితర అంశాలపై డీఆర్డీఏ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది సీసీలు, ఆర్పీలు ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రుణాలు మంజూరు చేసి నగదు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు తన దృష్టికి వచ్చాయని, ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇతర దేశాలకు వలసల నిరోధానికి గట్టిగా కృషి చేయాలని, మెరుగైన జీవనోపాధికి స్థిరమైన చర్యలు చేపట్టాలన్నారు. లేసు అల్లికలు ఆకర్షణీయంగా ఉంటేనే మార్కెటింగ్ ఉంటుందని, స్థానిక మార్కెటింగ్ పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీపీఎంలు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాళ్లకూరు వెంకన్న హుండీ ఆదాయం రూ.21.31 లక్షలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుండీలు లెక్కింపు నిర్వహించారు. 97 రోజులకు గాను రూ.21,31,807 ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారి, ఆకివీడు సమూహ దేవాలయాల కార్యనిర్వహణాధికారి అల్లూరి సత్యనారాయణరాజు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళామండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డాల రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ములకలపల్లి అలీషా

తాడేపల్లిగూడెం అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం కడకట్ల ప్రాంతానికి చెందిన ములకలపల్లి అలీషా (69) బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో వైపు యాక్టీవా మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. ఫైర్ స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి అటువైపు వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ అలీషా పక్క నుంచి వెళ్తూ ఢీకొనడంతో అదుపు తప్పి అలీషా డిపోకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆలీషాకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ప్రైవేటు అంబులెన్స్ ద్వారా అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అలీషా మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టణ ఎస్సై జి శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలీషా పట్టణానికి చెందిన ఒక ఎరువుల దుకాణంలో పని చేస్తున్నాడు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



పైడిరాజు (ఫైల్)

పెంటపాడు: గుర్తు తెలియని రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గూడెం జీఆర్పీ ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాలివి. ప్రత్తిపాడు ఎస్సీపేటకు చెందిన పెనుమాక పైడిరాజు (45) కూలీపని చేసుకొని జీవిస్తున్నాడు. ఇతను రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తూ గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై అప్పారావు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బుధవారం కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. మృతుడు పైడిరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగల చోరీపై కేసు నమోదు

అత్తిలి: బంగారు ఆభరణాల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. అత్తిలి రామన్నపేటకు చెందిన బయ్యే పూర్ణిమ తణుకులో ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 11న యథావిధిగా డ్యూటీకి వెళ్లానని, 12వ తేదీన బీరువా చూడగా అది తెరచి ఉందని, బీరువాలో ఉండాల్సిన రెండు కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదని బాధితురాలు పూర్ణిమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.ప్రేమరాజు చెప్పారు.

ఆర్టీసీ కార్గోలో తణుకు ఫస్ట్

- 321 శాతం గ్రోత్‌తో రాష్ట్రంలో తణుకు డిపో మొదటి స్థానం
- ముగిసిన డోర్ డెలివరీ మాసోత్సవాలు



తణుకు ఆర్టీసీ డిపోలో కార్గో కేంద్రం

తణుకు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహించిన కార్గో పార్శిల్స్ అండ్ కొరియర్ డోర్ డెలివరీ మాసోత్సవాల్లో తణుకు ఆర్టీసీ డిపో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గత నెల 20 నుంచి ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించిన మాసోత్సవాల్లో భాగంగా డిపోల వారీగా తణుకు డిపో 321 శాతం గ్రోత్‌తో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఆర్టీసీ సంస్థ ఆదాయాన్వేషణలో భాగంగా ప్రవేశపెట్టిన కార్గో పార్శిల్ సర్వీస్ సేవలు ఇప్పుడు డోర్ డెలివరీ రూపంలో వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయి. వ్యాపార, వాణిజ్య, రైతాంగ పార్శిల్స్ రూపంలో ఆర్టీసీ కార్గో ద్వారా సురక్షితంగా ఇంటి గుమ్మంలోకే చేరుస్తుండడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే మార్గమనే నినాదం తాజాగా కార్గో పార్శిల్స్ డోర్ డెలివరీల్లో కూడా అనుకరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్దేశించిన 80 ప్రాంతాల్లో కార్గో సెంటర్‌కు 10 కిలోమీటర్ల దూరంలోని ఇంటి గుమ్మంలోకి కార్గో డోర్ డెలివరీ సేవలు అందుతుండడంతో వినియోగదారులు అధికశాతం కార్గో కేంద్రానికే తమ పార్శిల్స్ అందజేస్తున్నారు.

ప్రత్యేక బహుమతులతో ఆకర్షణ

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా తణుకు డిపోలోని కార్గో కేంద్ర సేవలను వినియోగదారులు విశేషంగా ఆదరించారు. ముఖ్యంగా వినియోగదారులతోపాటు సంస్థ ఉద్యోగులు కూడా తమ వంతుగా ఈ మాసోత్సవాల్లో ప్రతి ఉద్యోగి స్వచ్ఛందంగా మూడు పార్శిల్స్ బుక్ చేయించాల్సిందిగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పిలుపునిచ్చారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమ వంతుగా పార్శిల్స్ బుక్‌చేసి సహకరించారు. మాసోత్సవాల్లో వినియోగదారులను ఆకర్షించే రీతిలో డోర్ డెలివరీలకు సంబంధించి లక్కీ డిప్‌ల ద్వారా ప్రత్యేకమైన బహుమతులను తణుకు నరేష్ క్లాత్ షోరూమ్, షాలేం పెన్ కార్నర్ యాజమాన్యం సౌజన్యంతో అందజేశారు.

మూడో స్థానంలో తాడేపల్లిగూడెం

రాష్ట్రవ్యాప్తంగా కార్గో డోర్ డెలివరీ సేవల్లో డిపోల వారీగా తణుకు డిపో మొదటి స్థానంలో నిలవగా రెండో స్థానంలో ప్రొద్దుటూరు, మూడో స్థానంలో తాడేపల్లిగూడెం డిపో నిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో జరిగే వ్యాపారాన్ని బట్టి టార్గెట్‌లు నిర్దేశిస్తామని ఆ టార్గెట్‌లు బుకింగ్స్‌లో వచ్చిన గ్రోత్ శాతంతో స్థానాలు కేటాయిస్తారని తెలిపారు.

మాసోత్సవంలో పార్శిల్స్ బుకింగ్స్ మొదటి మూడు స్థానాల్లో..

డిపో	టార్గెట్	బుకింగ్స్	గ్రోత్ శాతం
తణుకు	1033	3316	321 శాతం
ప్రొద్దుటూరు	1920	5823	303 శాతం
తాడేపల్లిగూడెం	620	1870	302 శాతం

అత్యుత్తమ సేవలు అందిస్తున్నాం



గతనెల 20 నుంచి ప్రారంభమైన వారోత్సవాల్లో వినియోగదారులను ఆకర్షించే విధంగా లక్కీ డ్రాలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందిస్తున్నాం. డిపో మేనేజరుతోపాటు కార్గో ఉన్నతాధికారుల సహాయ సహకారాలు తీసుకుంటూ సమష్టి కృషితో పనిచేస్తున్నాం. డోర్ డెలివరీల్లో తణుకు డిపో కార్గో సెంటర్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది.

– షేక్ లాల్, తణుకు ఆర్టీసీ డిపో కార్గో ఇన్‌చార్జి

వినియోగదారుల ఆదరణ అద్వితీయం



నిర్దేశించిన 80 ప్రాంతాల్లో డిపో నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఇంటి గుమ్మంలోకే పార్శిల్‌ను చేరుస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2023–24 సంవత్సరానికిగాను కార్గో ద్వారా ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.190 కోట్లు ఆదాయం సమకూరింది. డోర్ డెలివరీ సేవల్లో తణుకు డిపో ప్రథమ స్థానంలో నిలవడం ఆ ప్రాంత వినియోగదారులు, ఉద్యోగుల కృషితో సాధ్యమైంది. త్వరలో పార్శిల్స్ డోర్ పికప్ కూడా ప్రారంభిస్తారు.

–జి.లక్ష్మీ ప్రసన్న వెంకట సుబ్బారావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమర్షియల్ మేనేజరు

వినియోగదారులు, ఉద్యోగుల కృషే



కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో తణుకు డిపో ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. వినియోగదారుల ఆదరణ, ఉద్యోగుల కృషితోనే ఈ ఘనత సాధించగలిగాం. మొదటి స్థానంలో నిలిచామని తెలియగానే తణుకు డిపోకు అధిక పార్శిల్స్ అందించిన శ్రీ లావణ్య ఫీడ్స్ ప్రొప్రైటర్ కోసూరి సతీష్ వర్మతోపాటు కృషిచేసిన సంస్థ ఉద్యోగులను ఘనంగా సత్కరించుకున్నాం.

– సప్పా గిరిధర్‌కుమార్, తణుకు డిపో మేనేజరు

నేటినుంచి జాతీయస్థాయి గో-కార్ట్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీల పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు జాతీయస్థాయి గో-కార్ట్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీ కృష్ణంరాజు చెప్పారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. పోటీల్లో విజేతలకు రూ.3 లక్షల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి బృందాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ వీవీ మురళీకృష్ణంరాజు, ఎస్ఎస్‌కే వర్మ, ఐఆర్‌పీ వర్మ, యు రాజేంద్రప్రసాద్, కె సురేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



ఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

పెదవేగి : విద్యుదాఘాతంతో ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలివి. పెదవేగి మండలం ముండూరుకు చెందిన బుడపన శ్రీను (40) కూలి పనికి వెళ్లి వస్తుండగా అతని చేతిలోని పామాయిల్ గెలలు నరికే ఇనుప రాడ్డు అదే గ్రామంలో ప్రమాదవశాత్తు కరెంటు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనుకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

అధికారికి ఆక్వా రైతు బెదిరింపు

- ప్రాణభయంతో పోలీసులను ఆశ్రయించిన వైనం
- డిప్యూటీ స్పీకర్ ఇలాకాలో ఘటన
- కేసు నమోదుకు నాలుగున్నర గంటల పడిగాపులు



ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన డ్రెయినేజ్ ఏఈ జయప్రకాష్, డీఈ అప్పన్న

సాక్షి, భీమవరం: ఆక్వా రైతు నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ డ్రెయినేజీ ఏఈ పోలీసులను ఆశ్రయించిన ఘటన శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నియోజకవర్గం ఉండిలో బుధవారం చోటుచేసుకుంది. ఫిర్యాదు ఇచ్చేందుకు నాలుగున్నర గంటల పాటు అధికారులు స్టేషన్ వద్ద పడిగాపులు కాయగా ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం జరిగిన ఉండి మండల సర్వసభ్య సమావేశంలో ఉండిలోని బొండాడ డ్రెయిన్ గట్టును ఆక్రమించి గ్రామానికి చెందిన ఓ రైతు చెరువులు తవ్వుతుంటే ఏం చేస్తున్నారని పాములపర్రు ఎంపీటీసీ సభ్యుడు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యడవల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఉప్పులూరు ఎంపీటీసీ సభ్యుడు నిమ్మల కేశవకుమార్ (బాలు) డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్‌ను నిలదీశారు. దీనిపై తనకు ఏ విషయం తెలీదని మత్స్యశాఖ అధికారులు అనుమతులిచ్చారని జయప్రకాష్ బదులిచ్చారు. దీంతో తప్పు మీదంటే మీదంటూ జయప్రకాష్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రాంబాబు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చేటుచేసుకుంది. భూములు ఆక్వాజోన్ పరిధిలో ఉన్నందున నిబంధనల మేరకు అనుమతులిచ్చామని ఎఫ్‌డీఓ రాంబాబు చెప్పారు. స్థలాన్ని పరిశీలించి నిబంధనలు మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ సభ్యులకు తెలిపారు.

రక్షణ కల్పించాలని..

ఆక్వా రైతు సాగిరాజు సాంబశివరాజు తనను ఫోన్‌లో బెదిరించారని, అయన నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ డీఈ ఉగ్రనరసింహ అప్పన్నతో కలిసి ఏఈ జయప్రకాష్ బుధవారం ఉదయం 10 గంటలకు ఉండి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులు ఫిర్యాదు తీసుకునే వరకు అక్కడే వేచి ఉన్నారు. ఏఈ జయప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. అనంతరం ఏఈ జయప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ ఆక్వారైతు సాంబశివరాజు తనను ఫోన్‌లో బెదిరించాడని, చెప్పినా వినకుండా నిబంధనలకు విరుద్ధంగా డ్రెయిన్ గట్టును ఆక్రమించి తవ్వకాలు చేశారన్నారు. మంగళవారం తనకు ఫోన్ చేసి బెదిరించారని, ఆయన్నుంచి ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

నా పొలాన్ని కలిపేసుకున్నారు

ఇదిలా ఉండగా సాంబశివరాజు ఆర్ఎస్ 311–2ఏ నంబర్‌లో గల తన 49 సెంట్ల పొలాన్ని ఆక్రమించి చెరువులు తవ్వుతున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్టు ఉండికి చెందిన దాట్ల శ్రీనివాసరాజు తెలిపారు. 13.52 ఎకరాల చెరువు తవ్వకాలకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా సుమారుగా 20 ఎకరాల తవ్వకాలు చేస్తున్నట్టు ఆరోపించారు.

దస్తూరీతో దోస్తీ

- విద్యార్థులకు చదువుతోపాటు దస్తూరీపైనా శ్రద్ధ అవసరం
- మంచి దస్తూరీకి మార్కులు దాసోహం
- నేడు జాతీయ చేతిరాత దినోత్సవం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఇప్పటి వరకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా తమ పాఠ్యాంశాల్లోని సిలబస్‌పై మాత్రమే దృష్టి కేంద్రీకరించారు. అయితే చదువుతో పాటు దస్తూరీ పైనా దృష్టి సారిస్తే చక్కటి మార్కులు సొంతమంటున్నారు నిపుణులు. అక్షర దోషాలు, గజిబిజి చేతిరాత వల్ల ఒకటి, రెండు మార్కులు కోల్పోయే ప్రమాదముందంటున్నారు. విద్యార్థి కోల్పోయే ఆ ఒకటి, రెండు మార్కులే ర్యాంకును వేలల్లో తగ్గించేస్తుందనే విషయాన్ని గుర్తెరిగి దస్తూరీపై కూడా శ్రద్ధ చూపాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమాధాన పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయుడికి మంచి దస్తూరీ కనిపిస్తే ఆ ప్రభావం అయన వేసే మార్కులపై సానుకూలంగా ఉంటుందని, ఈ క్రమంలో చక్కటి దస్తూరీతో పరీక్షలు రాస్తే మంచి మార్కులు అందుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాలను మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు మంచి మార్కులు వేసే అవకాశముంటుందంటున్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే లోపు ప్రతి రోజూ కొద్ది సేపు రాతపై కూడా శ్రద్ధ పెట్టి సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చంటున్నారు. పెన్‌టిప్‌ను దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు గుండ్రంగా వచ్చే అవకాశముంటుందని సూచిస్తున్నారు. దీనితో పాటు చేతిరాత మెరుగుపరుచుకోవడానికి మరిన్ని మెళకువలను సూచించారు. అవేమిటంటే..

విద్యార్థులు చేసే పొరపాట్లు

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా ఉంటే జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కోపేజీలో 16–18 లైన్లకు మించకూడదు. లైన్లు సమాంతరంగా ఉండాలి. చాలా మంది విద్యార్థులు ఒత్తిపట్టి రాస్తుంటారు. పెన్నును వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు అక్షరాలు కనిపిస్తూ చివరికి జవాబుపత్రం గజిబిజిగా తయారవుతుంది. కొందరు అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లీషు జెడ్ తరహాలో, 5ను ఎస్ తరహాలో, 0ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి.

మెలకువలు పాటించండి.. మార్కులు సాధించండి

- చేతి రాత గుండ్రంగా, అర్థమయ్యేలా ఉండేలా రాస్తే మంచిది.
- మనం రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దేవారిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు.
- వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి.
- దిద్దుబాటు, గజిబిజి ఉండకూడదు. పదానికి, పదానికి మధ్య దూరం ఉండాలి
- ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకోవాలి. తర్వాతే జవాబు రాయాలి.
- సమాధాన పత్రంలో పేజీకి 15 – 16 లైన్లు ఉండాలి.
- పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి వరుసలో ఎంత బాగా రాశారో చివరి వరకు అదే దస్తూరీ కొనసాగించాలి.
- తెలుగు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి.
- అక్షర దోషాలు, దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి
- గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గుతాయి. గ్రాఫ్ చక్కగా గీయాలి
- సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి
- సాంఘికశాస్త్రం సబ్జెక్టులో సమాధానాలను పాయింట్లవారీగా రాయాలి. శీర్షికలు, ఉపశీర్షికలు కింద అండర్‌లైన్ చేయాలి.
- మంచి పెన్నులను ఉపయోగించాలి. అక్షరాలు గుండ్రంగా, స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి
- అక్షరాలు, పదాలు, వాక్యాలు, పంక్తుల మధ్య తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలి
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్‌పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ నిటారుగా కూర్చొని రాయడం మంచిది.

మూల్యాంకనంలో ప్రాధాన్యం



మంచి దస్తూరీకి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయాలి. చేతిరాతపై సాధన చేయాలి. సమాధానాలు అర్థమయ్యేలా రాయాలి. ప్రతి రోజూ కొద్ది సేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.

– ఎండీ ఇర్షాద్ అహ్మద్, ప్రభుత్వ డ్రాయింగ్ టీచర్

దస్తూరీపై దృష్టి పెట్టాలి



అందమైన చేతిరాత మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది బాగా చదువుతారు. కానీ సరిగా రాయకపోవడంతో అనుకున్న మార్కులు సాధించలేకపోతున్నారు. అందువల్ల చిన్న వయసు నుంచే దస్తూరీపై దృష్టి సారిస్తే మంచిది. విద్యార్థుల తల్లితండ్రులు కూడా ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.

–మజ్జి కాంతారావు, ప్రముఖ చిత్రకారుడు

టెక్‌జైట్ 25 వెబ్‌సైట్ ప్రారంభం



ట్రిపుల్ ఐటీలో టెక్‌జైట్-25 వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్

నూజివీడు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సాంకేతిక ఉత్సవాల నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. వచ్చే నెలలో స్థానిక ట్రిపుల్ ఐటీలో నిర్వహించనున్న టెక్‌జైట్–25కు సంబంధించిన వెబ్‌సైట్‌ను బుధవారం డైరెక్టర్ ట్రిపుల్ ఐటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించి వాటిపై ఫీడ్‌బ్యాక్‌ను తీసుకునేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలుగులోకి తేవడంతో పాటు మెరుగుపరచడానికి ఉపయోగపడతాయన్నారు. ఏఓ బీ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఐఐటీలు, ఎన్ఐటీలు, విశ్వవిద్యాలయాలను ఈ టెక్‌జైట్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనిలో రోబోటిక్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్, హ్యాకథాన్ తదితర అనేక రకాల పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలకు రూ.5 లక్షల విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. టెక్‌జైట్–25లో పాల్గొనే వారు టెక్‌జైట్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సీఏఓ బండి ప్రసాద్, ప్లేస్‌మెంట్ డీన్ పీ శ్యామ్, డీన్ అకడమిక్స్ రత్నాకర్, ఎస్‌డీసీఏసీ కన్వీనర్ జ్యోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

నకిలీ జడ్జి అవతారంలో మోసం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఒక వ్యక్తి నకిలీ జడ్జి అవతారం ఎత్తాడు. యువతకు ఉద్యోగాలకు ఇప్పిస్తానని లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. ఒక మహిళను తాను జడ్జినని చెప్పి నమ్మించి ఆమెను వివాహం చేసుకుని బురిడీ కొట్టించాడు. అంతేకాకుండా ఇటీవల అదనపు కట్నం కోసం ఆమెను వేధించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. నిందితుడిని పోలీసులు ఏలూరు రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేశారు. డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ కేసు వివరాలు బుధవారం వెల్లడించారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల వేములవాడకు చెందిన నామాల నరేందర్ నకిలీ జడ్జి అవతారం ఎత్తాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో యువతను మోసం చేస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి లక్షల వసూలు చేశాడు. ఇదే క్రమంలో ఏడాది క్రితం ఏలూరులోని కొత్తపేట ప్రాంతానికి చెందిన సామంతుల నిర్మల అనే యువతిని మ్యాట్రిమోనిలో పరిచయం చేసుకుని తాను జడ్జిని అంటూ నమ్మించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో రూ.25 లక్షలు కట్నంగా తీసుకున్న నరేందర్ మరో రూ.50 లక్షలు కావాలంటూ డిమాండ్ చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. నరేందర్ నకిలీ జడ్జిగా గుర్తించటంతోపాటు వేధింపులు భరించలేని నిర్మల గతేడాది నవంబర్‌లో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన ఎస్సై క్రాంతిప్రియ దర్యాప్తు చేయగా నరేందర్ నకిలీ జడ్జి అవతారంలో అనేకమందిని మోసం చేసినట్లు తెలిసింది. అలాగే ఖమ్మం, ఉప్పల్, చందానగర్ ప్రాంతాల్లోనూ పలు కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. అతను మూడు నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. బుధవారం పక్కా సమాచారంతో ఏలూరు రైల్వే స్టేషన్‌లో రైలు తనిఖీ చేసి మరీ నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ల యజమానుల నిరసన



దొంగరావిపాలెం వద్ద ఇసుక లారీలను అడ్డుకుంటున్న ట్రాక్టర్ల యజమానులు

పెనుగొండ: ఇసుక ర్యాంపులో ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్‌కు అనుమతించకపోవడంతో ట్రాక్టర్ యజమానులు నిరసన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కడింపాడు ఇసుక ర్యాంపులో కేవలం లారీలకు మాత్రమే ఇసుక లోడింగ్ అంటూ, ట్రాక్టర్లకు ఎగుమతి చేయడానికి నిరాకరించడంతో ట్రాక్టర్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా దొంగరావి పాలెం వద్ద నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం దొంగరావిపాలెం ఏటిగట్టుపై ఇసుక లారీల రాకపోకలను సైతం అడ్డుకున్నారు. ట్రాక్టర్లకు అనుమతి పత్రాలు కావాలంటూ దాటవేస్తున్నారని, లారీలకు ఇది వర్తించదా అని ప్రశ్నించారు. గంటపాటు జరిగిన నిరసన అనంతరం గొడవ సద్దుమణిగింది.

క్లుప్తంగా

శ్రీదేవి మహంకాళమ్మకు విశేష పూజలు


విశేష అలంకరణలో శ్రీదేవి మహంకాళమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోటలోని శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 45వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మ వారికి బుధవారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధనను 25వేలమందికి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, పసల అచ్యుతం, చంటి, గట్టిం మాణిక్యాలరావు, మాకా శ్రీనివాసరావు, నవదోయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, సభ్యులు, వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు పాల్గొన్నారు.

తణుకు బాలురు ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ


తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో భాగంగా బుధవారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్ కె.రామకృష్ణ, డి.మల్రెడ్డి పాఠశాలలో తరగతులు నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజనం, ప్రయోగశాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి తెలిపారు. ఉదయం అసెంబ్లీ సమయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన తనిఖీల్లో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల్లో క్రమశిక్షణ పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి.జే ప్రభువరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు


గుడాల వేణుతేజ (ఫైల్)

అత్తిలి: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి ప్రేమరాజ్ బుధవారం తెలిపారు. అత్తిలి శివారు బొంతు వారిపాలెం గ్రామానికి చెందిన గుడాల వేణుతేజ పదో తరగతివరకు చదివి కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 12వ తేదీన గుడాల వేణుతేజ, అతని స్నేహితుడు గుడాల తేజ గొడవపడ్డారని, ఈవిషయాన్ని వేణుతేజ తన తల్లి గుడాల లక్ష్మికి తెలిపాడు. ఈ గొడవ విషయంపై తల్లి తన కుమారుడిని మందలించింది. ఈనెల 16న ఉదయం గుడాల వేణుతేజ టిఫిన్ చేయడానికి అని బయటకు వెళ్లాడని, ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తల్లి ఫోన్ చేయగా స్విఛాఫ్ వచ్చిందని తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్లవద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి గుడాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్ష


వాసవీలో జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జాతీయ సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే జేఈఈ మెయిన్స్ మొదటివిడత పరీక్ష బుధవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. రెండు పూటలా పరీక్షను నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 219 మందికి గాను, 217 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 221 మందికి గాను 220 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్కేజీ కృష్ణంరాజు చినఅమిరం గ్రామ పంచాయతీలో పని చేసిన కాలంలో నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కమిటీ నియమించామని వివరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు

- నగానికిపైగా ప్లాస్టిక్ వ్యర్థాలే
- మునుగుతున్న రోడ్లు


బిన్నుల్లో వ్యర్థాలు


డ్రెయిన్‌లో వ్యర్థాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవ జీవనశైలికి హాని చేస్తున్న పాలిథిన్ సంచుల వినియోగం తాడేపల్లిగూడెం పట్టణంలో తారస్థాయికి చేరుకుంది. దీని నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయడంలో యంత్రాంగం విఫలమైంది. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. ప్లాస్టిక్ ఓ అద్భుతమైన రసాయన సమ్మిళిత పదార్థము. దీంతో అనేకవస్తువులు తయారు చేయవచ్చును. ఇవి అత్యంత అందంగాను, రంగు రంగులతో ఉండి అత్యంత చౌకగా ఉండటంతో ప్లాస్టిక్ ప్రపంచవ్యాప్తంగా బాగా ప్రచారంలోకి వచ్చింది. ఈ ప్లాస్టిక్‌తో తయారు కాబడని వస్తువు అంటూ ఏదీలేదు అంటే అతిశయోక్తి కాదు. నేడు ఆ ప్లాస్టిక్ తక్కువ మైక్రాన్‌లతో వినియోగం కారణంగా వాటి నుంచి వ్యర్థాలు పెరుకుపోయాయి. పర్యావరణం అంతట వెదజల్లి ఉండటంతో పర్యావరణానికి పెనుముప్పు సంభవించింది. యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ సంచులే కారణంప్లాస్టిక్ సంచులు ఉపయోగించడం వల్ల జరిగే సమస్య, అంతాఇంతా కాదు. యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ సంచులు, కాపీ కప్పులు, ప్లాస్టిక్ ప్లేట్లు, శుభ కార్యక్రమాలు సమయంలో భోజనాలు వద్ద వాడే ప్లాస్టిక్ రోల్స్ ఇవన్నీ కూడా పర్యావరణానికి హాని కలిగించే విధంగా మారాయి.

సులువుగా సరుకులను తెచ్చుకోవచ్చు

పలుచని ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, రోల్స్ తక్కువ విలువ కలిగి ఉండటం, వీటిని ఉపయోగించడం తేలిక కావడంతో అటు అమ్మకందార్లు, ఇటు కొనుగోలుదారులు తక్కువ మైక్రాన్స్ ఉన్న ప్లాస్టిక్‌ను ఉపయోగించడం ప్రారంభించారు. తయారీదారులు, అమ్మకందారులు, వాడుతున్న ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పట్ల తగ్గేది లేదు అంటూ వాటిని ఇష్టానుసారంగా ఉపయోగించడంతో రోడ్లు, ఖాళీ స్థలాలు, డస్ట్ బిన్నులు, డ్రెయినేజీ సిస్టమ్ ఇలా ఎక్కడ చూసిన అక్కడే ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నీటిలోను, మట్టిలోను కలవడం, విషపూరితం కావడంతో నేడు అవే వ్యర్థాలు ప్రజలందరిని కలవరుపెడుతున్నాయి.

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పాట్లు

మానవ జీవన శైలికి హాని కలిగించే పాలిథిన్ కారణంగా పట్టణంలో ఎక్కడ చూసిన అక్కడే పాలిథిన్ పేరుకుపోయింది. వాటిని తరలించే క్రమంలో సైతం పారిశుద్ధ్య సిబ్బంది వెనుకబడ్డారు. పట్టణ రూపురేఖలు మారుతున్నాయి. జనాభా పెరుగుతుంది. తగిన విధంగా పారిశుద్ధ్య సిబ్బంది పురపాలక సంఘానికి లేరు. దీంతో పాటు చెత్త సేకరణ వాహనాలు పారిశుద్ధ్య సిబ్బందికి సమకూరలేదు. ఇటీవల తోపుడు బండ్లు ఇచ్చినా, తక్కువ పరిమాణంలో మాత్రమే వ్యర్థాలను తరలిస్తున్నాయి.

ప్లాస్టిక్ నిషేధం..

ఇటీవల కాలంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేశారు. శానిటరీ, పబ్లిక్ హెల్త్ అధికారులు వివిధ వ్యాపార సంస్థలపై దాడులు పెంచారు. ప్రజలు చేతి సంచులు తీసుకువెళ్లడం ప్రారంభించారు. కొంత కాలం సజావుగానే సాగింది. ఇదే సమయంలో వ్యాపారస్తులు సైతం భయం నటించారు. సీక్రెట్‌గా ప్లాస్టిక్ సంచులను ఇవ్వడం ప్రారంభించారు. అనంతరం ఎవో కారణాలు చేత వ్యాపారస్తుల్లో భయం తగ్గింది. దీంతో ప్రజలు చేతి సంచులను తీసుకువెళ్లడం మానివేశారు. దీంతో తక్కువ మైక్రాన్ ప్లాలిథిన్ వినియోగం తిరిగి పెరిగింది.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం

తక్కువ మైక్రాన్స్ వినియోగాన్ని నిషేధించేదుకు టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి జరుగుతుంది. ఆర్డీఓ, ఎంఆర్ఓ, కమిషనర్ తదితర అధికారులతో బృందం ఏర్పడింది. ఇటీవల పట్టణంలో ప్లాస్టిక్ నిరోధించేందుకు విశేష కృషి చేశాం. లక్ష రూపాయిలు పైబడి ఫైన్‌లు వేశాం. 300 నుంచి 400 కేజీలు వరకు తక్కువ మైక్రాన్ పాలిథిన్‌ను స్వాధీనం చేసుకున్నాం. – శ్రీమన్నారాయణ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జి

ప్రభుత్వానికి.. ప్రజలకు వారధిగా పనిచేయాలి


పంచాయతీ కార్యదర్శుల యూనియన్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ కార్యదర్శులు సంఘటితమై ఇటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల యూనియన్ డైరీని ఆవిష్కరించారు. ప్రభుత్వ విధానాలు, జీవోలతో పాటు సమగ్ర సమాచారం డైరీలో నిక్షిప్తం కావడం అభినందనీయమన్నారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావిపాటి వీరబ్రహ్మం, కార్యదర్శులు బి.ఫణికుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, వాణి, శ్రీనివాస్, రవిచంద్ర, రమేష్, దివ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతుల కల్పనకు కృషి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నూతన అభివృద్ధి కమిటీతో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి

తణుకు అర్బన్: రాష్ట్రంలో చాలా ఆస్పత్రులతో పోల్చుకుంటే తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు బాగున్నాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నూతన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తణుకు ఆస్పత్రికి సత్వర వైద్యసేవలు అందించే క్రమంలో చాలా సదుపాయాలు అవసరమని ఎమ్మెల్యే తెలిపారని, ఆస్పత్రికి అవసరమైన సేవల్లో భాగంగా బ్లడ్ బ్యాంక్, అత్యాధునిక పరికరాలు, భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రాబోయే నాలుగు నెలల్లో కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా అన్ని నియోజకవర్గాల్లోను డయాలసిస్ సెంటర్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వైద్యవర్గాల కొరతతో పాటు అవసరమైన పరికరాలు, సాధ్యమైనంత వరకు సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ అత్యవసర మరమ్మతులకు రూ.76 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు. అభివృద్ధి కమిటీకి సంబంధించి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేకో చైర్మన్, ఎంపీ, వివిధ పార్టీలు, సంస్థలకు సంబంధించి వల్లూరి గంగాధరరావు, సుంకర ప్రసాద్, కామాసు ధరలక్ష్మీ కిరణ్మయి, వజావత్ కాన్‌రాజ్, డాక్టర్ ఆయేషా పటాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్, మునిసిపల్ కమిషనర్‌లు సభ్యులుగా కలిపి 13 మందితో కమిటీని నియమించినట్లు చెప్పారు. వైద్యులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

రీ-సర్వేకు అందరూ సహకరించాలి


ఇరగవరంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఇరగవరం: మండలంలోని ఇరగవరం మండలం పొడలాడ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే రైతు సమక్షంలో మాత్రమే జరగాలని ముందస్తు సమాచారం రైతుకి నోటీసు ద్వారా తెలియజేయాలన్నారు. సదరు ప్రక్రియను వేగవంతం చేసి దీర్ఘకాలిక భూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇరగవరం మండలం యర్రాయిచెరువు గ్రామంలో సర్వే నెం.142 పంట బోది సుమారు 350 రైతుల వ్యవసాయ భూమిలకు నీరు అందక దీర్ఘకాలిక సమస్యగా ఉందని తెలుపగా సదరు సమస్యను మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చర్చించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ భూమి రీసర్వేని పరిశీలించిన జేసీ


కొమరవరంలో వ్యవసాయ భూమిని రీసర్వే చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

తణుకు అర్బన్: వ్యవసాయ భూమి రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా తణుకు మండలం కొమరవరం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే ద్వారా తమ భూమి హద్దులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండవచ్చని అన్నారు. సర్వేకు సంబంధించి రైతాంగానికి ముందుగానే నోటీసులు ఇవ్వాలని, రైతులంతా సర్వేలో పూర్తిస్థాయి డాక్యుమెంట్స్‌తో వచ్చేలా సమాచారాన్ని అధికారులు ఇవ్వాలని సూచించారు. తణుకు తహసీల్దార్ డి.అశోక్‌వర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


అత్తిలి : రైతులకు మినరల్‌మిక్చర్‌ను అందజేస్తున్న పశుసంవర్థకశాఖ ఏడీ


జగ్గన్నపేట గ్రామంలో పశువైద్య శిబిరం దృశ్యం

అత్తిలి: పాడి పశువుల సంరక్షణకు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జంతుసంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్ తెలిపారు. అత్తిలి శివారు బొంతువారిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పశువులు, కోళ్లు, కుక్కలకి వ్యాధి నిరోధక టీకాలు ఎప్పటికప్పుడు వేయించుకోవాలని తద్వారా అంటువ్యాధుల్ని అరికట్టవచ్చన్నారు. ఈసందర్భంగా పశుసంవర్ధకశాఖ సిబ్బంది 50 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, 125 కోళ్లకు కొక్కెర వ్యాధినిరోధక టీకాలు వేశారు. దూడలకు నట్టల నివారణ, ఎదకు రాని పశువులకు, చూలుకట్టని పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మినరల్ మిక్చర్ మందుల్ని అందజేసారు. ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కె నరసింహారావు మాట్లాడుతూ పశువులు ఎక్కువసార్లు తిరిగి పొర్లకుండా ఉండాలంటే సరిపడా, మినరల్‌మిక్చర్ రోజుకి 60 గ్రాముల దాణాతో పాటు ప్రతీ పశువుకి ఇవ్వాలన్నారు. పశు సంవర్ధకశాఖ ద్వారా చేపట్టే వివిధ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

341 పాడి పశువులు, జీవాలకు టీకాలు పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని జగ్గన్నపేట బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి టి.వి.విజయ్ కుమార్ పాల్గొని పశువుల ఆరోగ్యం, నట్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. అనంతరం 341 పాడి పశువులు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ములకాల సూర్యారావు, ఏహెచ్ఏ టి.చంద్రశేఖర్, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ముక్కేపురంలో 100 పశువులకు వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు గ్రామంలోని ముక్కేపురం ప్రాంతంలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది 100 పశువులకు వైద్యపరీక్షలు చేసారు. లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పీతల సత్యనారాయణ ప్రారంభించారు.

డ్రైవర్లు విధుల్లో ఏకాగ్రతతో ఉండాలి


తణుకులో ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రీషియన్‌కు బహుమతి అందజేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

తణుకు అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు మంచి ఆహార అలవాట్లను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా మానవ తప్పిదాల కారణంగానే 85 శాతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సమయంలో మంచి ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ఏకాగ్రత తప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా గ్యారేజీ మెకానిక్ రౌతు సత్యనారాయణ, ఎలక్ట్రీషియన్ కరకట్ల సీతారాముడు, అసిస్టెంట్ మెకానిక్ కప్పల సన్నీబాబులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా బుకింగ్స్‌లో విశేష సేవలందించిన డీఎంఈ షేక్ లాల్‌ను ప్రశంసించారు. తణుకు డిపో మొదటి స్థానం సాధించడంలో భాగస్వామ్యులైన డోర్ డెలివరీ చేసే ఆటోడ్రైవర్ నారాయణ, కార్గో సిబ్బందికి నగదు బహుమతులు అందచేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అండ్ గ్యారేజీ, ఆఫీస్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మాట్లాడుతున్న కోనాల భీమారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఎలాంటి కాలయాపన లేకుండా త్వరితగతని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కపర్ది భవనంలో బుధవారం ఇళ్ల స్థలాల అర్జీదారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాడానికి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు సీపీఐ పోరాటం చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, వద్దాది మేరి, ఎస్. నాగలక్ష్మి, దాస్యం రాము తదితరులు మాట్లాడారు. బి.స్వర్ణకుమారి, చినసీత, ఎస్.వెంకటలక్ష్మి, అనసూయ, గంగరాజు, ప్రసన్న, సత్యవతి, ఎస్తేర్ రాణి, ప్రసన్న కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిగూడెం: రోగులకు ఏ సమయంలో ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు చెప్పారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలు పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టెస్టింగ్ ల్యాబ్‌లో యంత్రాల పనితీరు చూశారు. డయాలసిస్ పేషెంట్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున ,రెండు కోట్ల రూపాయలతో ప్రత్యేక వసతి ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంటు తాతారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జీవిత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపునివ్వాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని, ఎల్ఐసీలో క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగుల నియామకాన్ని సత్వరమే చేపట్టాలని కోరుతూ బుధవారం స్థానిక జీవిత బీమా సంస్థ ఎదుట భోజన విరామ సమయంలో ఎల్ఐసీ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. సంఘ కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వాలని, 3, 4 తరగతుల ఉద్యోగుల నియామకాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తోట పద్మారావు, ధనరాజు, సాయిరాం, మహంకాళి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ, తదితరులు హాజరైయారు.

రైస్‌మిల్లును సందర్శించిన విద్యార్థులు


తిరుపతిపురంలో రైస్‌మిల్‌ను సందర్శించిన బల్లిపాడు విద్యార్థులు

అత్తిలి: విద్యార్థులు ఒకేషనల్ విద్యపై ఆశక్తి చూపుతూ చదవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తిరుపతిపురం గ్రామంలో గల శ్రీసత్యనారాయణ రైస్ మిల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఇండస్ట్రియల్ విజిట్ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ కె ప్రియాంక విద్యార్థులకు ధాన్యం నుంచి బియ్యం ఎలా తయారు చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, జి శ్రీనివాసరావు, రాంప్రసాద్, అన్నపూర్ణ, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతి


కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న భీమారావు

తణుకు అర్బన్: తణుకు కేంద్ర జిల్లా ప్రభుత్వాసుపత్రి 150 పడకలకు అనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుద్ధ్య కార్మికుల నియామకం చేపట్టాలని, 4 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, పీఎఫ్ సక్రమంగా జమ చేయాలని కోరుతూ కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు వినతిపత్రాలు సమర్పించారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బుధవారం నూతన అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన వారిని కలిసి వినతిపత్రాలు అందచేసినట్లు భీమారావు వివరించారు.

26న భీమవరంలో ఉచిత క్యాన్సర్ శిబిరం

భీమవరం: పట్టణంలోని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదిన ఆనంద పంక్షన్ హాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షాశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కంతేటి వెంకటరాజు, డీటీడీసీ బాబు, చెరుకువాడ రంగసాయి చెప్పారు. బుధవారం వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

సురభి నాటకోత్సవాలు

ఉండి: కోలమూరు గ్రామంలో 20వ తేదీన ప్రారంభమైన సురభి నాటకోత్సవాలు కనుల పండుగలా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. గురువారం శ్రీనివాసకల్యాణం నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.